
సాక్షి
బాపట్ల
గురువారం । 7 । డిసెంబర్ । 2023



వరద నీరు విడుదల

తాడేపల్లిరూరల్ : ఎగువన భారీ వర్షాలు కురవడంతో బుధవారం ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇరిగేషన్ అధికారులు స్వల్పంగా గేట్లు ఎత్తి దిగువకు 18,500 క్యూసెక్కుల వరద నీటిని వదిలారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.

శతాధిక వృద్ధుడు మృతి



గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామానికి చెందిన పసుమర్తి శ్యామ్యూల్‌జాన్ (101) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. అతనికి ఐదుగురు సంతానం. భార్య కాంతమ్మ గతంలోనే మరణించారు. శ్యామ్యూల్‌జాన్ వ్యసాయ పనులు చేస్తుండేవారు.

న్యూస్‌రీల్

16, 17న స్విమ్మింగ్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీలలో రాష్ట్రస్థాయి 9వ సబ్‌జూనియర్, జూనియర్ బాలల వింటర్ ఆక్వాటిక్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలు, రాష్ట్ర జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనే జిల్లా సబ్‌జూనియర్, జూనియర్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 10వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్టు వివరించారు. పట్టణంలోని సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో ఈపోటీలు జరగనున్నట్టు వెల్లడించారు. స్విమ్మింగ్‌తోపాటు వాటర్‌పోలో జట్టు ఎంపికలూ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 9న శనివారం లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: అమరేశ్వరాలయంలో స్వామికి బుధవారం దాతల సహకారంతో లక్షబిల్వార్చనను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చకులు, వేద పండితులు జరిపించారు. తొలుత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ వేద పండితులు గణపతి హోమం, సూర్యనమస్కారాలు నిర్వహించారు. స్వామికి విశేష అలంకరణ చేశారు. అనంతరం సహస్ర నామాలతో రుత్విక్కులు అమరేశ్వరునికి లక్ష బిల్వ దళార్చన నిర్వహించారు. బాలచాముండికా అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు

పులిచింతలకు వరద నీరు



అచ్చంపేట : నదీ పరీవాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు పులిచింతల ప్రాజెక్టులో వరదనీరు వచ్చిచేరడంతో జలాశయంలో నీటి నిల్వ ఒక టీఎంసీ పెరిగింది. ప్రాజెక్టులో నిన్నమొన్నటి వరకు 13.7200 టీఎంసీలు ఉండగా, బుధవారం సాయంత్రానికి 14.8260 టీఎంసీలకు పెరిగింది. ఎగువ నుంచి 1,0231 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 522.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 8,036, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 837.90 అడుగుల వద్ద ఉంది.

యార్డుకు 18,688 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 18,688 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 17,861 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 23,300 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,807 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



భట్టిప్రోలు మండలం ఐలవరం పునరావాస కేంద్రంలో బాధితులకు నగదు సాయం అందిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, కలెక్టర్ రంజిత్ బాషా



నగరంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



కర్లపాలెంలో నీటమునిగిన మిర్చి మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన

సహాయం.. వాయువేగం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్వర ఆదేశాల ఫలితం

- తుఫాన్ బాధితులకు తక్షణ ఉపశమనం
- వెల్లువలా కదిలిన అధికారయంత్రాంగం
- సుడిగాలి పర్యటనలతో ఆపన్నహస్తం
- నీట మునిగిన గృహాలకు నిత్యావసరాలు
- పొలాల్లో నిలిచిన నీరు తొలగింపునకు చర్యలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: మిచాంగ్ తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం వాయువేగంతో కదిలింది. వాతావరణ శాఖ అల్పపీడన హెచ్చరికలు జారీ చేయగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణ చర్యలకు అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ సహాయక చర్యలపై సూచనలు, సలహాలు అందించారు. తుఫాన్ కంటే వేగంగా సహాయక చర్యలు జరగాలని ఆదేశించారు. అందుకనుగుణంగానే అధికారయంత్రాంగం వెల్లువలా కదిలింది. సహాయక చర్యలను వేగవంతం చేసింది. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసింది. బాధితులకు ఆశ్రయం కల్పించింది. విద్యుత్ పునరుద్ధరణ, వైద్యశిబిరాల నిర్వహణ, యుద్ధప్రాతిపదికన రోడ్లపై కూలిన చెట్ల తొలగింపు వంటి చర్యలు చేపట్టింది. బుధవారం ఉదయం కలెక్టర్ రంజిత్ బాషా అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి తుఫాన్ అనంతరం బాధితులకు అందాల్సిన సహాయంపై మార్గనిర్దేశం చేశారు. తక్షణమే క్షేత్రస్థాయికి వెళ్లి నష్టాలను అంచనా వేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని సూచించారు. ఈ సహాయక చర్యల్లో అధికారులతోపాటు ప్రజాప్రతినిధులూ భాగస్వాములు అవుతున్నారు.

తక్షణ చర్యలకు నిదర్శనాలివే..

- గాలి వానకు జిల్లాలో 353 కరెంట్ స్తంభాలు నేలకొరగగా తక్షణం స్పందించిన విద్యుత్ శాఖ ఇప్పటివరకు 302 స్తంభాలను పునరుద్ధరించింది. 261 గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలగగా 224 గ్రామాల్లో తక్షణం సరఫరా పునరుద్ధరించారు.
- రహదారులకు అడ్డంగా 282 చెట్లు కూలిపోగా వాటన్నింటినీ యుద్ధప్రాతిపదికన తొలగించారు.
- 74 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 3,888 మందికి ఆశ్రయం కల్పించారు. అల్పాహారం, భోజనం అందించారు.
- 96 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతినడంతో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పారు. పంట రక్షణ సూచనలు, సలహాలు అందించారు.



వరహాపురంలో నీట మునిగిన వరి పంటలను పరిశీలిస్తున్న డీఏఓ షేక్ సత్తార్



రేపల్లె పునరావాస కేంద్రంలో బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఎంపీ మోపిదేవి

సహాయక చర్యలు ఇలా..

విద్యుత్ పునరుద్ధరించిన గ్రామాలు :	261
ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు :	74
ఆశ్రయం పొందిన బాధితుల సంఖ్య :	3,888
ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలు :	93
శిబిరాలకు వెళ్లిన ఒక్కో కుటుంబానికి ఆర్థిక సాయం :	రూ.2,500
ఒక వ్యక్తి మాత్రమే వస్తే :	రూ.1,000
దెబ్బతిన్న గృహానికి :	రూ.10,000

- ప్రధానంగా 70 వేల హెక్టార్లలో వరి పంట గాలివానకు నేలవాలడంతో కలెక్టర్ పొలాలను పరిశీలించారు. ప్రతి ధాన్యపు గింజనూ కొంటామని భరోసా ఇచ్చారు. ఉపాధిహామీ కూలీలతో వరి పొలాల్లోని నీటిని బయటకు పంపేలా చర్యలు చేపట్టారు.
- మండలానికి రెండు పొక్లెయిన్లు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి దెబ్బతిన్న రోడ్లు, కాలువల వద్ద మరమ్మతులు చేపట్టారు.
- గండ్లు పడితే అవసరమైన చోట వినియోగించేందుకు ఇసుక సంచులు సిద్ధం చేశారు.



కర్లపాలెం పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కోన



భట్టిప్రోలు మండలం ఓలేరులో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

- 93 చోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు సేవలందించారు.
- నీటిలో మునిగిన గృహాల్లోని నివాసితులకు 25 కేజీల బియ్యంతోపాటు ఇతర సరుకులు పంపిణీ చేశారు.
- తుఫాన్ వల్ల దెబ్బతిన్న 32 గృహాలకు ఒక్కొక్క దానికి రూ.10 వేలు పరిహారం పంపిణీ చేయనున్నారు.

ప్రజాప్రతినిధుల పర్యటన

అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి తుఫాన్ సమాయక చర్యల్లో పాల్గొన్నారు. మంత్రి మేరుగ నాగార్జున, కలెక్టర్ రంజిత్ బాషా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలంలోని ఐలవరం పునరావాస కేంద్రంలో బాధితులకు బియ్యం, సరుకులు, పరిహారం మొత్తాలను పంపిణీ చేశారు.

- రేపల్లె నియోజకవర్గం నగరం మండలంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు నీట మునిగిన పొలాలను పరిశీలించారు. రైతులకు భరోసా ఇచ్చారు.
- బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలంలో దెబ్బతిన్న వరి పంటను కలెక్టర్ రంజిత్ బాషా, వ్యవసాయశాఖ జేడీ అబ్దుల్ సత్తార్, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పరిశీలించారు. అనంతరం యాజిలి పునరావాస కేంద్రంలో బాధితులకు వారు నిత్యావసర సరుకులతోపాటు నగదు మొత్తాన్ని పంపిణీ చేశారు.
- పర్చూరు నియోజకవర్గం మార్టూరు మండలం రాజుగారిపాలెం రోడ్డు వరద ఉధృతికి కోతకు గురికావడంతో రాకపోకలు స్తంభించాయి.
- పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ దెబ్బతిన్న రోడ్డును పరిశీలించి తక్షణం పునరుద్ధరించాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు మరమ్మతులు చేపట్టారు.

ముందస్తు చర్యలతో నష్ట నివారణ



సహాయక చర్యలను వేగవంతం చేశాం. తుఫాన్‌కు ముందే తగిన చర్యలు తీసుకోవడం వల్ల భారీ నష్టాలను నివారించగలిగాం. లోతట్టు ప్రాంతాల ప్రజలను తుఫాన్ షెల్టర్లు, పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని వసతులూ కల్పించాం. విద్యుత్ సమస్యలను అధిగమించాం. ఎక్కడైనా సరఫరాకు అంతరాయం కలిగినా వేగంగా పునరుద్ధరించాం. రోడ్లపై పడిన చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగించాం. అన్ని రకాల నష్టాల అంచనాలను ప్రాథమికంగా ప్రభుత్వానికి పంపాం. పూర్తిస్థాయి నివేదికను త్వరలో పంపుతాం. సహాయక చర్యలు కొనసాగుతాయి.

– రంజిత్‌బాషా, కలెక్టర్, బాపట్ల జిల్లా

కొమ్మమూరు కాలువకు గండి

పర్చూరు, కారంచేడు మధ్యనున్న మొండి కాలువ తెగి వరదనీరు కొమ్మమూరు కాలువలోకి ప్రవహించడంతో కారంచేడు, స్వర్ణ గ్రామాల వద్ద కొమ్మమూరు కాలువకు గండ్లు పడ్డాయి. దీంతో ఆ రెండు గ్రామాలతోపాటు చీరాల పరిధిలో పది వేల ఎకరాల వరి పంట నీట మునిగింది. పొలాలు చెరువులను తలపించాయి. జాయింట్ కలెక్టర్ శ్రీధర్ గండ్లు పడిన కాలువను పరిశీలించారు. నష్ట నివారణ చర్యలు చేపట్టారు.

ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంటాం

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, కలెక్టర్ రంజిత్‌బాషా భరోసా
- ఐలవరంలో బాధిత కుటుంబాలకు రూ.2,500, నిత్యావసరాలు పంపిణీ

ఐలవరం(భట్టిప్రోలు): మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పునరావాస కేంద్రాల్లో ఉంటున్న ప్రతి కుటుంబాన్నీ ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున తెలిపారు. భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలో రెండు రోజులుగా స్థానిక సచివాలయం–2, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తల దాచుకుంటున్న 26 తుఫాన్ బాధిత కుటంబాలకు మంత్రి నాగార్జున, కలెక్టర్ రంజిత్ బాషా రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ప్రతి కుటుంబానికీ 25 కిలోల బియ్యం, లీటర్ పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో కందిపప్పు, కిలో బంగాళ దుంపలు, కిలో టమాటాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ తుఫాన్ ఉధృతిని గమనించి ప్రభుత్వం నాలుగు రోజుల ముందు నుంచే సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ ఈ రెండు రోజులు ప్రతి పునరావాస కేంద్రంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలు కల్పించినట్టు వెల్లడించారు. ఇందుకోసం జిల్లాకు రూ.2 కోట్లు కేటాయించామని వివరించారు. శిబిరంలో 82 మంది తలదాచుకున్నారని తెలిపారు. అనంతరం వారిని ఇళ్లకు చేర్చారు. తర్వాత తుఫాన్ ధాటికి పడిపోయిన వరి పంటను కలెక్టర్, మంత్రి పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ జి.చంద్రశేఖరరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, సచివాలయ ఇన్‌చార్జ్ నీలం దేవరాజు, పంచాయతీ కార్యదర్శి గోలి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ టి.ఊహారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజి పాల్గొన్నారు.



ఐలవరం పునరావాస కేంద్రంలో తలదాచుకున్న బాధితులతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున, కలెక్టర్ రంజిత్‌బాషా, ఆర్డీఓ హేలా షారోన్

కూలిన చారిత్రక ఆలయ శిఖరం

బల్లికురవ: ఎంతో చరిత్ర కలిగిన ఆలయం ఆరేళ్లుగా జీర్ణావస్థతో కూలే దశకు చేరింది. కానీ ఏ అధికారీ పట్టించుకోలేదు. ఫలితంగా మిచాంగ్ తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు బుధవారం ఆలయ శిఖరం కూలింది. బల్లికురవ మండలంలోని కొణిదెన గ్రామాన్ని 12వ శతాబ్దంలో చోళ రాజులు పాలించారు. అప్పట్లో గ్రామంలో 101 బావులు తవ్వారని ప్రతీతి. 101 శిలలు ఏర్పాటు చేశారని చెబుతారు. గ్రామానికి ఆగ్నేయ భాగంలో ఎత్తైన కొండపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవ స్వామి ఆలయాన్ని అప్పట్లో చోళ రాజులు నిర్మించారు. ఈ ఆలయానికి 36 ఎకరాల భూములు ఉన్నాయి. ఆలయం జీర్ణావస్థకు చేరటంతో గత ప్రభుత్వ హయాంలో గ్రామస్తులు పురావస్తు శాఖకు, దేవదాయ శాఖకు ఫిర్యాదు చేశారు. అయితే ఎవరూ పట్టించుకోలేదు. ఆలయ భూముల కౌలు వేలం ఏటా దేవదాయ శాఖకు వెళుతోంది. ఈ క్రమంలో ఆలయ వెనుక భాగంలోని శిఖరం కూలటంతో భక్తులు, అర్చకుడు ఆలయంలోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా రెండు శాఖలూ సమన్వయంతో ఆలయాన్ని అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకురావాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.



భారీ వర్షాలకు కొణిదెనలో కూలిన ఆలయ శిఖరం

తుఫాన్ వల్ల వరిపంటకు అధిక నష్టం



బాపట్ల: తుఫాన్ వల్ల జిల్లాలో వరి పంట అధికంగా దెబ్బతిందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కలెక్టర్ పి.రంజిత్ బాషా వివరించారు. తుఫాన్ నష్టంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి బుధవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. సహాయక చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో బాపట్ల నుంచి పాల్గొన్న కలెక్టర్ రంజిత్ బాషా జిల్లాలోని పరిస్థితుల గురించి సీఎంకు వివరించారు. ప్రాథమిక నష్టాలపై నివేదిక సమర్పించారు. త్వరలో పూర్తి నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని వెల్లడించారు. కాన్ఫరెన్సులో ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ సి.హెచ్.శ్రీధర్, డీఆర్వోఓ పి.వెంకటరమణ పాల్గొన్నారు.

రైతులకు పూర్తి న్యాయం

నేలవాలిన వరి పొలాలు పరిశీలించిన బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని, నష్టపోయిన రైతులను తప్పకుండా ఆదుకుంటామని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. పిట్టలవానిపాలెం మండలంలో బుధవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. తుఫాన్ వల్ల నేలవాలిన వరి పంటను, తడిచిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు ధైర్యాన్నిచ్చారు. భవనంవారిపాలెం, చోడిపాలెం, కోమలి, సంగుపాలెం, కోడూరు, చందోలు, ఖాజీపాలెం, పిట్టువారిపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాలలో పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ తడిచిన ధాన్యాన్ని, రంగుమారిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ షేక్ బాజీ, వైస్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ హుస్సేన్, మునీర్, శ్యామల నాగిరెడ్డి, మాధవరావు, చేబ్రోలు వీరయ్య, చెన్నుబోయిన గంగయ్య, చల్లాపల్లి విజయరాజు తదితరులు ఉన్నారు.



తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోన

విద్యుత్ శాఖ సేవలు భేష్

తుఫాన్ సమయంలో రాత్రీపగలు మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించిన విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్, సిబ్బందిని ఎమ్మెల్యే కోన ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం

బాపట్ల కలెక్టర్ రంజిత్‌బాషా

చెరుకుపల్లి: రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బాపట్ల కలెక్టర్ రంజిత్‌బాషా చెప్పారు. మండలంలోని కనగాల గ్రామంలో తుఫాన్ వల్ల ముంపునకు గురైన, నేల వాలిన పంట పొలాలను బుధవారం అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు. తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, ప్రతి ధాన్యపు గింజనూ సేకరిస్తామని భరోసా ఇచ్చారు. త్వరలో పంట నష్టం అంచనాలు నమోదు చేస్తామని వివరించారు. ముఖ్యంగా పొలాల్లో నీరు త్వరగా బయటకు వెళ్లేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట రేపల్లె ఆర్డీఓ షారోన్, జిల్లా వ్యవసాయ అధికారి షేక్ సత్తార్, తహసీల్దార్ కె.వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ పాల్గొన్నారు.



కనగాలలో వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులు

పంట పొలాలు పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

వరహాపురం(వేమూరు): తుఫాన్ వల్ల నష్టపోయిన పంటలను అంచనా వేస్తామని బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ సత్తార్ చెప్పారు. వేమూరు మండలంలోని వరహాపురం, వేమూరు గ్రామాల్లో నీటి మునిగిన వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ వల్ల, గత రెండు రోజులుగా కురిసిన వర్షం వల్ల వరి పంటలు నీట మునిగి పోయాయని వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంట నష్ట పోయిన ప్రతి రైతును గుర్తించి పంట నష్టం వేయాలని ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. రైతులు అధైర్య పడవద్దన్నారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతునూ వ్యవసాయాధికారులు గుర్తించడం జరుగుతుందని సత్తార్ తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి జె.సునీత, రైతులు ఉన్నారు.


భట్టిప్రోలు మండలం అక్కివారిపాలెంలో వర్షం నీటిలో మగ్గుతున్న వరి


భట్టిప్రోలు మండలం పెసర్లంకలో నీటిలో నానుతున్న కంద పంట


చుండూరు మండలం చినపరిమిలో రహదారిపై ఆరబెట్టిన ధాన్యం


పిట్టలవానిపాలెం - నిజాంపట్నం గ్రామాల మధ్య రహదారిపై కూలిన చెట్టు

'మిచాంగ్' ప్రభావం..

జిల్లాలో మిచాంగ్ తుఫాన్ భీభత్సం ఇంకా కన్పిస్తూనే ఉంది. పిట్టలవాని పాలెం – నిజాంపట్నం ప్రధాన రహదారిపై చెట్లు కూలిపోయాయి. పలు గ్రామాల్లో నేలవాలిన వరిపైరుపై వర్షం నీరు ప్రవహిస్తుంది. దీంతో వరి మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పొలాల్లో నిలిచిన వర్షం నీటిని బయటకు తీసేందుకు నానా తంటాలు పడుతున్నారు. భట్టిప్రోలు మండలంలో వరి, అరటి, మినుము పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం సైతం తడిచిపోవడంతో వాటిని మళ్లీ ఆరబెట్టుకునే ప్రయత్నాల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. – సాక్షి, నెట్‌వర్క్


పీవీ పాలెంలో వరిపొలంలో నిలిచిన వర్షం నీటిని బయటకు పంపుతున్న రైతు


కొల్లూరు మండలం చినపులివర్రులో జాగ్రత్త చేసిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కాటాలు వేస్తున్న రైతులు


కొల్లూరు మండలం చినపులివర్రులో వర్షానికి చెమ్మగిల్లిన వడ్లను ఆరబెట్టుకుంటున్న రైతు కుటుంబం

నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- వలివేరులో తుఫాన్ బాధితులకు భోజన వసతి ఏర్పాట్ల పరిశీలన

వలివేరు(వేమూరు): మిచాంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని వలివేరు గ్రామానికి చెందిన సంచార జాతులు 10 కుటుంబాల వారికి యడ్ల పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. దుండి పాలెం గ్రామంలో మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 కుటుంబాలకు పునరావాసం ఏర్పాటు చేశారు. ప్రతి కుటుంబానికి రూ 2500 ఆర్థిక సహాయం, భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ వల్ల వివిధ గ్రామాల్లో జీవిస్తున్న సంచార జాతులు చెందిన కుటుంబాలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందజేయడం జరిగిందన్నారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకోమని ఆదేశించారన్నారు. అదేవిధంగా చుండూరు మండలంలో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఎంపీపీ జాలాది రూబేను, చుండూరు గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గాదె శివరామ కృష్ణా రెడ్డి, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

కుల నిర్మూలన పుస్తకావిష్కరణ

పాత గుంటూరు: కుల నిర్మూలన పుస్తకం చదవకుండా భారతదేశ సమాజాన్ని, చరిత్రను అర్థం చేసుకోలేరని ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచన కుల నిర్మూలన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

తుఫాన్ బాధిత రైతులకు ప్రభుత్వం అండ

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- పలు గ్రామాల్లో ముంపునకు గురైన పంటల పరిశీలన


పిరాట్లంక గ్రామంలో వరి కంకులను పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ

రేపల్లె రూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను రాష్ట్రప్రభుత్వం ఆదుకునేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించిందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ చెప్పారు. తుఫాన్ ప్రభావంతో రేపల్లె పట్టణ, మండలంలోని పలు గ్రామాలలో నష్టపోయిన వరిపైరును బుధవారం ఆయన పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం కాల్వల ద్వారా సకాలంలో నీరు అందించటంతో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో తుఫాన్ పంటలకు నష్టం చేకూర్చటం బాధాకరమన్నారు. తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా ఈదురుగాలులతో పాటు కురిసిన వర్షంతో పైరు నేలవాలటం, నీటిలో వరి ఓదెలు ఉండటం ప్రతి ఒక్కరిని తీవ్రంగా కలచివేసే అంశమన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుందని నమ్మి రైతుల వెన్నంటి ఉండే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటారని భరోసానిచ్చారు. రైతులతో పాటు కౌలు రైతులు, దేవదాయ భూములను సాగుచేసే రైతులను ఆదుకునే విధంగా నివేదికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్‌లను కోరతామన్నారు. అధికారులు తమ పరిధిలోని సాగుభూములను పరిశీలించి నిష్పక్షపాతంగా నష్టపరిహారం అంచనాలను సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పేటేరు, చాట్రగడ్డ, మోర్తోట, చెన్నుపల్లివారిపాలెం, పిరాట్లంక, తుమ్మల, పోటుమెరక గ్రామాలలో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆయనవెంట ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆపన్నహస్తం ..

రేపల్లె రూరల్: మిచాంగ్ తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు అధికారులు సైతం సఫలీకృతులయ్యారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పట్టణ, మండలంలోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందినవారికి బుధవారం ప్రభుత్వ సాయం అందజేసి, నిత్యవసర వస్తువులు పంపిణీ చేసి మాట్లాడారు. వాతావరణశాఖ నుంచి తుఫాన్ హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి రాష్ట్రప్రభుత్వం జిల్లా, మండల స్థాయి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో, కచ్చా గృహాలలో నివాసం ఉంటున్నవారి భద్రత కోసం ప్రభుత్వం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అల్పాహారం, భోజనం సదుపాయాలు, మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. వైద్యశాలలు ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులు సైతం అందించిందని గుర్తుచేశారు. ఒక్కో కుటుంబానికి రూ.2500 నగదుతో పాటు 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, కూరగాయలు తదితర నిత్యవసర వస్తువులు అందించి భరోసా కల్పించిందన్నారు. తహసీల్దార్ మల్లికార్జునరావు మాట్లాడుతూ పట్టణంలో 156 కుటుంబాలకు రూ.2500 చొప్పున, 87 మందికి రూ.1000 చొప్పున, మండలంలో 183 కుటుంబాలకు రూ.2500 చొప్పున, 170 మందికి రూ.1000తో పాటు నిత్యవసర వస్తువులు అందించామని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చందోలు స్టేషన్ ట్రైనీ డీఎస్పీగా విద్యాశ్రీ



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ డీఎస్పీగా శిక్షణ పొందేందుకు టి.విద్యాశ్రీ బుధవారం విధుల్లో చేరారు. రెండు నెలల పాటు ట్రైనీ డీఎస్పీగా, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తానని ఆమె తెలిపారు. ఈమేరకు మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటించి విధి విధానాలను తెలుసుకుంటానన్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం



పర్చూరు (చినగంజాం): స్థానిక పర్చూరు స్టేట్‌బ్యాంక్ ఏటీఎంలో చోరీ చేసేందుకు దొంగలు విఫలయత్నం చేశారు. బుధవారం అర్ధరాత్రి 12:12 నిమిషాల నుంచి రెండు గంటల పాటు ఏటీఎంను పగలగొట్టేందుకు ప్రయత్నించినట్లు బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ రాజు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో ఏటీఎంలో రూ.20 లక్షల నగదు ఉన్నట్లు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కొండవీడు ఘాట్‌రోడ్డుపై దొర్లిన బండరాళ్లు

- తొలగించే వరకు సందర్శకులకు అనుమతులు రద్దు
- పల్నాడు జిల్లా డీఎఫ్‌ఓ ఎన్.రామచంద్రరావు వెల్లడి


మొదటి దశ ఘాట్ రోడ్డులోని 3.5 కి.మీ మలుపు వద్ద పడిన భారీ బండరాళ్లు

యడ్లపాడు: చారిత్రక పర్యాటక కేంద్రమైన కొండవీడుకోట ఘాట్ రోడ్డుపై భారీ బండరాళ్లు దొర్లిపడ్డాయి. తుఫాను కారణంగా వరుసగా రెండు మూడు రోజులు ఎడతెరపిన వాన కురవడంతో కొండశిఖరాలపై నుంచి భారీగా నీటి ప్రవాహం కిందకు దుమికింది. ఈ క్రమంలో రాళ్లకింద మట్టికరిగిపోయి భారీ బండరాళ్లు సైతం కదిలి దొర్లుకుంటూ వచ్చి ఘాట్‌రోడ్డుపై పడ్డాయి. ప్రధానంగా మొదటి ఘాట్‌రోడ్డు 3.5 కి.మీ. మలుపు వద్ద, కొండపై స్వాగతం ద్వారం ముందు, రెండోదశ ఘాట్‌రోడ్డు ప్రారంభంలోనూ ఈ భారీ బండరాళ్లు అస్తవ్యస్తంగా పడి ఉండటంతో సందర్శకుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ విషయంపై పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికతో కొండవీడుకోట సందర్శకులకు అనుమతుల్ని రద్దు చేశామన్నారు. మూడు రోజులుగా చెక్‌పోస్టు దాటి ఎవరినీ పైకి వెళ్లేందుకు అనుమతించకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అధిక వర్షం కారణంగా పలుచోట్ల కొండపై ఉన్న రాళ్లు జారీ రోడ్డుపై వచ్చి పడ్డాయని వాటిని తొలగించేందుకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో చర్చించామన్నారు. యుద్ధ ప్రాతిపదికన వాటిని తొలగించి ఆ తర్వాత సందర్శకులను అనుమతిస్తామని వెల్లడించారు.

పల్నాడు జిల్లాలో 2713.6 మిల్లీమీటర్ల వర్షం

- అత్యధికంగా సత్తెనపల్లి మండలంలో.. • అత్యల్పంగా వెల్దుర్తిలో!

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో మిచాంగ్ తుఫాన్ కారణంగా 2713.6 మిల్లీమీటర్ల (271 సెం.మీ) వర్షం కురిసిందని వాతావరణ అధికారులు వెల్లడించారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలోని 28 మండలాల్లో వర్షం పడిందన్నారు. అత్యధికంగా సత్తెనపల్లి మండలంలో 181.2 మిల్లీ.మీ వర్షం పడగా చిలకలూరిపేటలో 174.2, బొల్లాపల్లిలో 162.2, నరసరావుపేటలో 154.2 మిల్లీ.మీ వర్షం కురవగా, అత్యల్పంగా వెల్దుర్తి మండలంలో 31.6 మి.మీ వర్షం కురిసింది. మండలాల వారీగా పరిశీలిస్తే... మాచర్లలో 51.0, దుర్గిలో 62.0, రెంటచింతలలో 32.2, గురజాలలో 83.2, దాచేపల్లిలో 55.2, కారంపూడిలో 98.2, పిడుగురాళ్లలో 99.6, మాచవరంలో 88.0, బెల్లంకొండలో 81.2, అచ్చంపేటలో 82.2, క్రోసూరులో 63.8, అమరావతిలో 89.0, పెదకూరపాడులో 107.0 మి.మీ వర్షం కురిసింది. అలాగే రాజుపాలెంలో 113.2, నకరికల్లులో 108.8, వినుకొండలో 83.4, నూజెండ్లలో 76.8, శావల్యాపురంలో 86.8, ఈపూరులో 80.2, రొంపిచర్లలో 116.2, ముప్పాళ్లలో 101.4, నాదెండ్లలో 134.6, యడ్లపాడులో 116.2 మి.మీటర్ల వర్షం కురిసింది.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక


దేవరకొండ ప్రేమసాగర్


రవితేజ

చీరాల రూరల్: జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు చీరాల క్రీడాకారులు ఎంపికయ్యారు. వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 2024 జనవరి 8 వరకు అరుణాచల్ ప్రదేశ్‌లోని ఈటా నగర్‌లో జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ (బాలికలు, బాలురు, మెన్ అండ్ ఉమెన్) పోటీలు నిర్వహించనున్నారు. చీరాల మండంలోని బుర్లవారిపాలెం సాయికాలనీకి చెందిన దేవరకొండ ప్రేమసాగర్‌కు 81 కేజీల యూత్ విభాగంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. అలానే దేశాయిపేటకు చెందిన టి.రవితేజ 96 కేజీల విభాగంలో, తోటవారిపాలేనికి చెందిన పి.యేసుబాబు 73 కేజీల విభాగంలో పాల్గొంటారు. వీరు గతంలో అనేక పోటీల్లో పతకాలు సాధించారు. రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి టి.దినేష్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడేటి వెంకట రామయ్యకు ప్రకాశం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పున్నారావు, జట్టు మేనేజర్ దేవరకొండ ప్రవీణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. పలువురు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

భారతరత్న అంబేడ్కర్‌కు ఘననివాళి


కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల: భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలను ముందుకుతీసుకువెళ్లాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకట రమణ, కలెక్టరేట్ ఏఓ గోపికృష్ణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

బాపట్లటౌన్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగ నిర్మాత, దేశానికి మొట్టమొదటి న్యాయశాఖ మంత్రి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సమాజంలో అస్పృశ్యతను, అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ఎంతగానో కృషిచేశారన్నారు. అంబేడ్కర్ ఆశయాలను, జీవితాన్ని స్ఫూర్తిని తీసుకొని యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏఆర్ డీఎస్పీ ఏండీహెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్‌బీ సీఐ వి.సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్‌ఐ ఎల్.మన్మథరావు, వెల్ఫేర్ ఆర్‌ఐ బి.శ్రీకాంత్ నాయక్, హోమ్ గార్డ్స్ ఆర్.ఐ ఎల్.గోపీనాథ్, డీపీఓ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

- రాత్రి వేళల్లో అందుబాటులో పీహెచ్‌సీ సేవలు
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: జిల్లాలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది సేవలందించాలని కోరారు. బుధవారం వైద్య అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఆదేశాలు జారీ చేశారు. కాకుమాను మండలం కొండపాటూరు ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాల, చేబ్రోలు మండలం వడ్లమూడి ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాల, ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాల, వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్, అనంతవరప్పాడు జిల్లాపరిషత్ హైస్కూల్, వట్టిచెరుకూరు జిల్లాపరిషత్ హైస్కూల్, తాడేపల్లి ఆర్ఎంఎస్ కాలనీ ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాల, పెదకాకానిలోని దర్గాగ్రామం, పెదకాకాని మండలం నంబూరు జెడ్పీ హైస్కూల్‌లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రాత్రి సమయంలో కూడా తెరిచి ఉంచుతారన్నారు. ప్రత్యేక శిబిరాల్లోనే వైద్యులు బస చేయాలని చెప్పారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు సంబంధిత ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు సక్రమంగా నిర్వహించేలా చూడాలని కోరారు.